క్లుప్తంగా

బాధిత కుటుంబానికి చేయూత



రేపల్లె రూరల్: విద్యుదాఘాతంతో తీవ్రగాయాలపాలైన బేతపూడి గ్రామానికి చెందిన ప్రైవేటు ఎలక్ట్రీషియన్ మౌలాలి కుటుంబానికి రేపల్లె ప్రైవేటు ఎలక్ట్రికల్ అండ్ ప్లంబర్స్ అసోసియేషన్ సభ్యులు సోమవారం చేయూతనిచ్చారు. రూ.59 వేలను బాధిత కుటుంబానికి అందజేశారు. సంఘం అధ్యక్షుడు అంకిరెడ్డి ఉపేంద్ర, ఉపాధ్యక్షుడు సురేష్, జాయింట్ సెక్రటరీ షంషుద్దీన్, సభ్యులు శివరామకృష్ణ, గోవిందు, ప్రసాద్, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ



రేపల్లె రూరల్: పట్టణ అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ కోరారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన మున్సిపల్ సాధారణ సమావేశంలో ఆమె మాట్లాడారు. సకాలంలో పన్నులు చెల్లించాలని ప్రజలకు సూచించారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు ముమ్మరం చేశామన్నారు. ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. తాగునీటి సమస్య నెలకొనే వార్డులలో టాంకర్‌ల ద్వారా పంపిణీ చేస్తామని వివరించారు. అనంతరం ఎజెండాలోని 62 అంశాలను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్తా, కమిషనర్ కాకర్ల సాంబశివరావు, అధికారులు, కౌన్సిలర్‌లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

9 అర్జీలు స్వీకరణ

రేపల్లె రూరల్: ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తొమ్మిది అర్జీలు స్వీకరించినట్లు ఆర్డీవో నేలపు రామలక్ష్మి తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి అనంతరం మాట్లాడారు. ఆయా అర్జీలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బీసీ సంఘంలో నియామకాలు



కొల్లూరు: బీసీ సంఘం మండల అధ్యక్షుల నియామకం చేపట్టినట్లు నియోజకవర్గ అధ్యక్షుడు మురాల వాసుదేవ్‌గౌడ్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా సంఘ మండల అధ్యక్షుడిగా కారుమూరి బ్రహ్మం యాదవ్, మహిళా విభాగ అధ్యక్షురాలిగా కనుమూరి శ్రీలక్ష్మిలకు నియామక ప్రతాలను అందజేశారు.

ఉపాధి పనులపై కొనసాగుతున్న ప్రజావేదిక

నగరం: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదిక సోమవారం నిర్వహించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో మండలంలోని 28 పంచాయతీలలో పనులకు సంబంధించి వివరాలు తెలుసుకోనున్నారు. డ్వాక్రా ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో మండలంలోని 1058 పనులకు రూ.9.94కోట్లు ఖర్చు చేశామన్నారు. పనులపై సామాజిక తనిఖీ ముగిసిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య, డ్వామా ఏపీడీ చంద్ర సువార్త, ఎంపీడీవో శ్రీనివాసులు, సోషన్ ఆడిట్ రీసోర్స్ పర్సన్ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

రంగిశెట్టి రమేష్‌కు ఛత్రపతి శివాజీ పురస్కారం

తెనాలి: జిల్లాలోని పొన్నూరులో గల పొన్నూరు బ్లడ్ డోనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తెనాలికి చెందిన రంగిశెట్టి ఫౌండేషన్ అధ్యక్షుడు, కవి, రచయిత డాక్టర్ రంగిశెట్టి రమేష్ (గంగాశ్రీ)ను ఛత్రపతి శివాజీ మహారాజ్ పురస్కారంతో సత్కరించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మధ్యప్రదేశ్, ఒడిశా, తమిళనాడు, కర్ణాటకలకు చెందిన 90 మంది స్వచ్ఛంద సేవాసంస్థల నిర్వాహకులు, రక్తదాతలకు పురస్కారాలను ప్రదానం చేసి సత్కరించారు. రంగిశెట్టి ఫౌండేషన్, శ్రీకృష్ణదేవరాయల కళావేదిక చైర్మన్‌గా రమేష్ చేసిన సామాజిక సేవకు గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందజేశారు. సంస్థ వ్యవస్థాపకుడు తిరుమలశెట్టి ఉమాశంకర్ నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో పూర్వ నాసా శాస్త్రవేత్త డాక్టర్ చందు సాంబశివరావు, పార్వతీనాయుడు, నేషనల్ ఫండమెంటల్ లీగల్ రైట్స్ చైర్మన్ కె.కల్పన, ఆంధ్రశాఖ చైర్మన్ వసంత్ పాల్గొన్నట్టు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలు

- నిరుపయోగంగా మారిన వెల్‌నెస్ సెంటర్లు
- పాలకుల నిర్లక్ష్యంతో ప్రజలకు అవస్థలు

వేమూరు: గ్రామీణ ప్రాంతంలోని ప్రజలు వైద్య సేవల కోసం ఇబ్బందులు పడకుండా ప్రతి గ్రామంలో వెల్ నెస్ సెంటరు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేశారు. గత ప్రభుత్వంలో అమర్తలూరు మండలంలోని పెదపూడి గ్రామంలో వెల్ నెస్ సెంటరు ప్రారంభించారు. మండలంలో 13 వెల్ నెస్ సెంటర్లు మంజూరు చేశారు. పెదపూడి, కూచిపూడి, ఇంటూరు, ప్యాపర్రు, యలవర్రు, పాంచాళ వరం గ్రామాల్లో వివిధ దశలలో నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటి గురించి పట్టించుకోవడం లేదు. దీంతో పలు వెల్‌నెస్ కేంద్రాలు అసాంఘిక కార్యకలాపాలలకు నిలయాలుగా మారాయి. వైద్య శాఖ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు తెలుపుతున్నారు.



పెదపూడి గ్రామంలోని వెల్‌నెస్ సెంటరు

ఉపాధి హామీ నిధులతో..

గత ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్ నెస్ కేంద్రాలు చేపట్టింది. కొన్ని గ్రామాల్లో సచివాలయాలు నిర్మాణం చేశారు. కొన్ని చోట్ల రైతు భరోసా కేంద్రాలు నిర్మించారు. వెల్ నెస్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. కొన్ని పెండింగ్‌లో ఉన్నాయి. ఉపాధి హామీ పథకం నిధులు ఉన్నా, కూటమి ప్రభుత్వం మాత్రం ఈ భవనాల గురించి పట్టించుకోవడం లేదని గ్రామస్తులు తెలిపారు.

పెదపూడి గ్రామంలో పేకాట

పెదపూడి గ్రామంలో నిర్మాణం చేపట్టిన వెల్ నెస్ కార్యాలయంలో కొందరు మద్యం తాగుతున్నారు. పేకాట జోరుగా సాగుతున్నా అధికారులు పట్టించు కోవడం లేదని గ్రామస్తులు తెలిపారు. ఉపాధి హామీ పథకం నిధులతో ఈ కేంద్రాన్ని ప్రారంభించాలని కోరారు. గత ప్రభుత్వం ఒక్కో సెంటర్‌కు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఏఎన్ఎం నర్సు, ఆశా వర్కర్, మేల్ నర్సును నియమించారు. వైద్య సిబ్బంది ద్వారా సేవలు అందిస్తున్నారు. వెల్ నెస్ సెంటర్లు లేకపోవడంతో ప్రజలతోపాటు సిబ్బంది కూడా అనేక ఇబ్బందులు పడుతున్నారు.

నిధులు కేటాయించి పనులు చేపట్టాలి



పెదపూడి వెల్ నెస్ సెంటరులో అసాంఘిక కార్యకలాపాలు కొనసాగుతున్నాయి, అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం వెల్ నెస్ కేంద్రానికి నిధులు మంజూరు చేసి మరమ్మతులు చేపట్టాలి.

– తెనాలి పవన్ కళ్యాణ్, ఎంపీటీసీ, పెదపూడి.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలి



వెల్ నెస్ సెంటరులో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలకు అధికారులు అడ్డుకట్ట వేయాలి. గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసి వెల్ నెస్ సెంటరు నిర్మాణం చేస్తే కొంత మంది వీటిని దుర్వినియోగం చేసుకుంటుస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– చొప్పర సుధాకర్, ఉప సర్పంచ్, పెదపూడి గ్రామం.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు



ఎంవీరాజుపాలెం కేంద్రంలో పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు



భట్టిప్రోలు హైస్కూల్‌లో రూమ్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



కొల్లూరు బాలికోన్నత పాఠశాల కేంద్రంలో విద్యార్థులు

రేపల్లె రూరల్: పట్టణం, మండలంలోని 7 పరీక్షా కేంద్రాలలో 1082 మందికిగాను 1,073 మంది పదో తరగతి విద్యార్థులు సోమవారం పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను విద్యాశాఖ జేడీ గంగాభవానీ, డిప్యూటీ డీఈవో కేసనశెట్టి సురేష్‌లు పరిశీలించారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈవో రత్న శ్రీధర్ తెలిపారు.

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలంలో సోమవారం వెల్లటూరు, పెదపులివర్రు, పల్లెకోన, ఐలవరం, జెడ్పీ హైస్కూళ్లు, టీఎంరావు హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులు పరీక్ష రాశారు. 748 మంది విద్యార్థులకు గాను 8 మంది గైర్హాజరయినట్లు ఎంఈవో పులి లాజర్, నీలం దేవరాజ్‌లు చెప్పారు.

నగరం: మండలంలో 168 విద్యార్థులు పదో తరగతి పరీక్ష రాశారని, పరీక్షా కేంద్రాలలో అంతా ప్రశాంతంగా సాగినట్లు ఎంఈవో పులి లాజర్ సోమవారం తెలిపారు.

కర్లపాలెం: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయని ఎంఈవో విజయశ్రీ తెలిపారు. మండల పరిధిలో ఉన్న మూడు కేంద్రాలలో 446 మందికిగాను 432 మంది పరీక్ష రాశారన్నారు. పిట్టలవానిపాలెం మండలంలో 425 మందికిగాను 419 మంది హాజరయ్యారని ఎంఈవో–2 రాజారత్నం తెలిపారు.

కొల్లూరు: పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. 235 మంది పరీక్షకు హాజరైనట్లు విద్యాశాఖాధికారులు తెలిపారు.

ఘనం పునఃప్రతిష్టా మహోత్సవాలు



గోవాడలో నూతన జీవ ధ్వజ స్తంభ పునః ప్రతిష్ఠ కార్యక్రమంలో భక్తులు



గొరిగపూడిలో శ్రీ నాగేశ్వర స్వామి స్వామి వారు

గొరిగపూడి(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం క్షేత్రంగా ప్రసిద్ధి గాంచిన గొరిగపూడి శ్రీ భ్రామరి దుర్గాదేవి సమేత శ్రీ నాగేశ్వరస్వామి దేవస్థానం పునరుద్ధరణ, జీవధ్వజ విమాన గోపుర శిఖర సహిత పునః ప్రతిష్టా మహోత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో భాగంగా సోమవారం స్వామి వారిని రేపల్లె మాజీ ఎమ్మెల్యే దేవినేని మల్లికార్జునరావు దంపతులు దర్శించుకుని, పూజలు నిర్వహించారు. గ్రామస్తులు రూ. కోటి విరాళాలను ఆలయం కోసం ఇచ్చారు. సర్పంచ్ గరిగపాటి మల్లిక –వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు వరికూటి పున్నయ్య, ఆలయ అర్చకులు ఆమంచి సృజన్ కుమార్, ఈవో పాపని రాజేశ్వరరావు పాల్గొన్నారు.



స్వామి వారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే దేవినేని మల్లికార్జునరావు దంపతులు

గోవాడలో.....

అమర్తలూరు (వేమూరు): అమర్తలూరు మండలంలోని గోవాడ గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ సీతా రామ చంద్ర స్వామి దేవాలయంలో నూతన జీవ ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ కార్యక్రమం సోమవారం వైభవంగా నిర్వహించారు. పరాశరం రామాచార్యులు కార్యక్రమాలు నిర్వహించగా, జీర్ణోద్ధరణ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైవీ సుబ్బారెడ్డికి డాక్టర్ గణేష్ పరామర్శ



రేపల్లె రూరల్: వైఎస్సార్ సీపీ పార్లమెంట్ సభ్యులు, పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి మాతృమూర్తి పిచ్చమ్మ మృతి సమాచారంతో పార్టీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఒంగోలులోని సుబ్బారెడ్డి స్వగృహానికి సోమవారం చేరుకుని పిచ్చమ్మ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

రోడ్ల వెంట చెత్త వేయొద్దు



కర్లపాలెం: గ్రామ పంచాయతీల పరిధిలో రోడ్ల వెంట చెత్త వేయవద్దని కర్లపాలెం ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు చెప్పారు. పేరలి పంచాయతీ పరిధిలోని వ్యర్థాలను పేరలి, కర్లపాలెం రహదారి పక్కన వేయటంతో తొలగింపు పనులను సోమవారం ఎంపీడీవో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

పేకాడిన నిందితులు అరెస్టు

అమర్తలూరు(వేమూరు): పేకాడిన ఐదుగుర్ని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ జానకి అమర్ వర్ధన్ తెలిపారు. అమర్తలూరు మండలంలోని మూల్పూరు గ్రామంలో సోమవారం ఐదుగురు వ్యక్తులు పేకాట ఆడుతూ చిక్కారు. వారి నుంచి రూ 2,590 డబ్బులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశారన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బొమ్మల మండపం వద్ద ఇంటి ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. ఈ ఘటనపై వాహన యజమాని సోమవారం తాడేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు మేక నరేంద్రరెడ్డి వివరాల మేరకు.. తాడేపల్లి మెయిన్ రోడ్డులోని బొమ్మల మండపం వద్ద పాత పోస్టాఫీస్ ఎదురుగా తన ఇంటి ఆవరణలో బ్లాక్ కలర్ పల్సర్‌ను పార్క్ చేశాడు. గుర్తు తెలియని వ్యక్తులు తెల్లవారుజామున హ్యాండిల్ లాక్ తొలగించి ద్విచక్ర వాహనాన్ని దొంగిలించారు. ఈ సంఘటనపై తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని తెలిపారు. తాడేపల్లి పట్టణ రూరల్‌లో గత కొంతకాలంగా ఇళ్ల ముందు, రోడ్లపై పార్కు చేసిన ద్విచక్ర వాహనాలు తరచు చోరీకి గురి అవుతున్నాయి. నెల రోజుల వ్యవధిలో సుమారు 15 ద్విచక్ర వాహనాల వరకు చోరీకి గురి అయినట్లు సమాచారం. దొంగిలించిన వాహనాలపై ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయడం లేదని విమర్శలొస్తున్నాయి.

చేనేత రంగంపై సర్కారు నిర్లక్ష్యం



భట్టిప్రోలులో నిరసన తెలుపుతున్న దృశ్యం

భట్టిప్రోలు: రాష్ట్ర బడ్జెట్‌లో చేనేత రంగానికి అన్యాయం జరిగిందని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సహాయక కార్యదర్శి జి. బాలాజీ పేర్కొన్నారు. దీనికి నిరసనగా సోమవారం భట్టిప్రోలు రథం సెంటర్‌లోని గాంధీ విగ్రహం వద్ద అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. గాంధీజీ విగ్రహానికి చేనేత కార్మికుడు కె. పార్థసారథి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ.. చేనేత కార్మికులకు, రంగానికి సర్కారు తీరని అన్యాయం చేసిందని ఆరోపించారు. ఏపీ మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. నాగాంజనేయులు, రైలుపేట సొసైటీ మాజీ అధ్యక్షులు బట్టు సుబ్బారావు, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె. రామకోటేశ్వరరావు, ఉమ్మడి గుంటూరు జిల్లా మాజీ అధ్యక్షులు బండారు దేవి వరప్రసాద్, ఏఐటీయూసీ నాయకులు బి.శ్రీనివాసరావు, ఏఐవైఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు బి. శ్రీనివాసరావు, ఒ.రమేష్, చేనేత కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో దోమల స్వైరవిహారం

నివారణకు చర్యలు తీసుకోవాలని అసిస్టెంట్ కలెక్టర్‌కు ప్రజల వినతి



అసిస్టెంట్ కలెక్టర్ పవర్ స్వప్నిక్ జగన్నాథ్‌కు సమస్యలు తెలియజేస్తున్న కౌన్సిలర్ , ఉడా కాలనీవాసులు

తెనాలి అర్బన్: పట్టణంలో దోమల సంచారం ఎక్కువగా ఉందని, పగటి పూట కూడా కుడుతున్నాయని, నివారణకు చర్యలు తీసుకోవాలని 30వ వార్డు కౌన్సి లర్ కొమ్మబత్తుని జయపాల్, ఉడా కాలనీవాసులు కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. 30వ వార్డులో పార్కు స్థలాన్ని అభివృద్ధి చేయాలని, కొత్త రోడ్లు నిర్మించాలని కోరుతూ అసిస్టెంట్ కలెక్టర్ పవర్ స్వప్నిక్ జగన్నాథ్‌కు వినతి పత్రం ఇచ్చారు. నీటి కుళాయి పన్నులను రద్దు చేయాలని 1వ వార్డు వాసి కోరారు. 7,11,15 వార్డు సచివాలయాల పరిధిలో రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలను తొలగించాలని పలువురు కోరారు. సమస్యల్ని పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతిరావు, ఎసీపీ టి.శివన్నారాయణ, పలువురు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావనతో సమాజంలో శాంతి



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

తెనాలి టౌన్: ఆధ్యాత్మిక భావనతో సమాజంలో శాంతి వర్ధిల్లుతుందని శ్రీ రమాసహిత సత్యనారాయణస్వామి దేవస్థానం అర్చకులు రొంపిచర్ల మారుతీ చక్రవర్తి పేర్కొన్నారు. బోసు రోడ్డులోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలో ఉన్న శ్రీ రమాసహిత సత్యనారాయణస్వామి అష్టమవార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ముగిశాయి. స్వామికి విష్వక్సేన పూజ, పుణ్యావాహం, కుంభారాధన, అగ్ని ధ్యానం, విశేష హోమం, చక్రస్నానం, పూర్ణాహుతి, కుంభాభిషేకం , హారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు నూకల వెంకట వేణుగోపాలరావు, ఇన్‌చార్జి కార్యదర్శి వక్కలగడ్డ గంగాధరరావు, సభ్యులు పాల్గొన్నారు.

నెల రోజుల్లో స్వచ్ఛ మంగళగిరిగా చేద్దాం



చెత్తను తొలగిస్తున్న కమిషనర్ అలీమ్‌బాషా, సిబ్బంది

మంగళగిరి టౌన్: మంగళగిరి నగరపాలక సంస్థను స్వచ్ఛ మంగళగిరిగా చేసేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా కోరారు. కార్పొరేషన్ పరిధిలో స్వచ్ఛ మంగళగిరి పేరిట ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు ప్రాంతాల్లో అధికారులు, నాయకులతో కలసి ఇంటింటికీ వెళ్లి పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్పొరేషన్ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, నాయకులతో ప్రతిజ్ఞ చేయించారు. అలీమ్‌బాషా మాట్లాడుతూ కాలువలో చెత్తను వేయవద్దని, ప్లాస్టిక్ సంచులు వాడవద్దని, తడి పొడి చెత్తను వేరుచేసి పారిశుద్ధ్య కార్మికులకు ఇవ్వాలని సూచించారు. నెల రోజుల పాటు 65 సచివాలయాల పరిధిలో స్పెషల్ డ్రైవ్ ద్వారా చెత్తను తొలగించడం, ప్రతి ఇంటికీ వెళ్లి పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించాలని ఉద్యోగులను ఆదేశించారు. 30 రోజుల పాటు అన్ని వార్డుల్లో పూర్తిస్థాయిలో చెత్తను తొలగించడం జరుగుతుందని తెలిపారు. స్వచ్ఛ మంగళగిరి కోసం 75 మంది పారిశుద్ధ్య కార్మికులను అదనంగా నియమించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ శకుంతల, సెక్రటరి దివ్యకుమారి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేష్, అసిస్టెంట్ ఇంజనీర్ ప్రసన్నజ్యోతి, శానిటరి ఇన్‌స్పెక్టర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల సీజ్



పోలీసులకు పట్టుబడిన ట్రాక్టర్లు

కొల్లిపర: ఇసుకను అక్రమంగా రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పి.కోటేశ్వరరావు తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను సోమవారం సీజ్ చేసినట్లు ఆయన చెప్పారు. డ్రైవర్ల దగ్గర పత్రాలు లేకపోవడంతో కేసు నమోదు చేసి, ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానం మండలంలోని నది పరీవాహక ప్రాంతాలైన అత్తలూరివారిపాలెం, వల్లభాపురం, మున్నంగి, పిడపర్రు, పిడపర్తిపాలెం, కొల్లిపర, హనుమాన్‌పాలెం, అన్నవరం, గౌడపాలెం గ్రామాలకు మాత్రమే వర్తిస్తుందని చెప్పారు. మిగిలిన గ్రామాలకు గానీ, పట్టణాలకు గానీ ఉచితంగా ఇసుకను తరలించడానికి అనుమతుల్లేవని పేర్కొన్నారు. వేబిల్లు లేకుండా అనుమతులు లేని ప్రదేశాలకు ఇసుక తరలించే వారిపై కేసులు నమోదు చేసి, చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఇటీవల మండలంలో దొంగ వే బిల్లు ద్వారా ఇతర ప్రదేశాలకు ఇసుక తరలిస్తున్నారని సమాచారం ఉందని, ఇటువంటి వాటిపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టినట్లు ఆయన వెల్లడించారు.

వైభవంగా ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు



స్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

తెనాలి టౌన్: స్థానిక చెంచుపేట అమరావతి కాలనీలోని శ్రీ గోదా పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం అష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ముగిశాయి. ఉత్సవాలను 9వ తేదీ నుంచి కన్నుల పండువగా నిర్వహిస్తున్నారు. భక్తులు దీక్ష కంకణం ధరించి స్వామికి పూజాదికాలు జరిపారు. అర్చకులు ప్రతి రోజూ స్వామికి నిత్య హోమం, మహా పూర్ణాహుతి, వసంతోత్సవం, చక్రతీర్థం తదితర పూజలు నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా మధ్యాహ్నం భక్తులకు భారీగా అన్నసంతర్పణ చేశారు. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యను పరిష్కరించాలి

తాడేపల్లిరూరల్ : బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ డిమాండ్ చేశారు. సోమవారం బ్రహ్మానందపురంలో కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి, కార్మికులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యాక్టరీకి సంబంధించిన ప్రతి కార్మికుడికి రూ.50 లక్షలు ఇస్తామని, ఒకసారి రూ.30 లక్షలు ఇస్తామని యాజమాన్యం మాట్లాడుతోందన్నారు. కార్మికుల సమక్షంలో చర్చలు జరిపి, న్యాయం జరిగే విధంగా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికైనా జోక్యం చేసుకుని సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించాలన్నారు. నాయకులు కె.ఆదినారాయణ, కార్మికులు నాగేశ్వరరావు, సుబ్బారావు, ఇమాంబి, మల్లేశ్వరి, రమాదేవి, దుర్గా భవాని, శారద, లక్ష్మి, గురవయ్య, సారమ్మ, ఆశీర్వాదం, యహోషువా, రిబ్కా పాల్గొన్నారు.

జవాన్ కుటుంబానికి ఆర్థికసాయం



పిట్టలవానిపాలెం (కర్లపాలెం): శిక్షణలో గన్ బ్యాక్‌ఫైర్ అవటంతో మృతిచెందిన సైనికుడు మోహన వెంకటేష్ కుటుంబానికి ఆర్థిక సాయం అందించటం అభినందనీయమని జిల్లా సైనిక సంక్షేమ అధికారి గుణశీల తెలిపారు. బాపట్ల డెల్టా సోల్జర్స్ గ్రూప్ సభ్యులు సేకరించి తీసుకువచ్చిన రూ.1.25లక్షలను సోమవారం సైనిక సంక్షేమ అధికారి గుణశీల చేతుల మీదుగా మోహన వెంకటేష్ కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో డెల్టా సోల్జర్స్ గ్రూపు సభ్యులు రవి, వేణుగోపాల్, దుర్గారావు, నజీర్ బాషా, నాగరాజు తదితరులు ఉన్నారు.